సాక్షి తూర్పుగోదావరి

శనివారం । 26 । అక్టోబర్ । 2024



బ్రహ్మోత్సవం.. కనుల వైభవం

కోనసీమ తిరుపతిగా ఖ్యాతి కెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి.


10లో



మద్యం దుకాణాలపై ప్రజాగ్రహం

కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన మద్యం పాలసీ ద్వారా దుకాణాల ఏర్పాటుకు లైసెన్సులు జారీ చేశారు. ఎక్కడైనా దుకాణాలు పెట్టుకోవచ్చనే నిబంధన ఉండడంతో జనావాసాల మధ్య ఏర్పాటు చేసేందుకు లైసెన్సుదారులు ప్రయత్నాలు చేస్తున్నారు.

86 వేల క్యూసెక్కుల జలాల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శుక్రవారం సాయంత్రం 86,182 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి వదిలారు. బ్యారేజీ వద్ద 10.90 అడుగులకు నీరు చేరింది. డెల్టా కాలువలకు 9,500 క్యూసెక్కులను వదిలారు. తూర్పు డెల్టాకు 2,500, మధ్య డెల్టాకు 2,000, పశ్చిమ డెల్టాకు 5,000 క్యూసెక్కులను వదిలారు.

న్యూస్‌రీల్

నో ఫోన్స్ ప్లీజ్!

- ఎక్సైజ్ కార్యాలయంలో కొత్త రూల్
- ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్న ప్రజలు



ఎక్సైజ్ సూపరింటెండెంట్ చాంబర్ వద్ద సెల్‌ఫోన్ తీసుకురావద్దని సూచిస్తున్న బోర్డు

సాక్షి, రాజమహేంద్రవరం: స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో నయా రూల్ నడుస్తోంది. ఎక్సైజ్ సూరింటెండెంట్‌ను కలవాలనుకుంటున్నవారు ఎవరైనా సరే మొబైల్ ఫోన్ చాంబర్ బయట పెట్టి కలవాల్సిందే. సాక్షాత్తు జిల్లా కలెక్టర్‌ను కలిసేందుకు వెళ్లేవారిని సైతం సెల్‌ఫోన్‌తో అనుమతిస్తారు. మరి ఎక్సైజ్ కార్యాలయంలో ఈ నిబంధన ఏమిటని ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యాలయానికి సాధారణంగా మద్యం వ్యాపారులు, మద్యం షాపులతో ఏవైనా సమస్యలు ఉత్పన్నమైన వారే వెళ్తుంటారు. అధికారికి, వ్యాపారులకు మధ్య అంత రహస్యం ఏం ఉంటుందన్న అనుమానం సర్వత్రా వ్యక్తమవుతోంది.

27 నుంచి వర్సిటీ విద్యార్థుల సమ్మేళనం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఇన్‌చార్జి వీసీ

రాజానగరం: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో ఆది, సోమవారాల్లో గుంటూరులో నిర్వహించ తలపెట్టిన యూనివర్సిటీ విద్యార్థుల సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఆ సంస్థ నన్నయ వర్సిటీ విభాగం కన్వీనర్ సత్యసాయి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల పరిధిలోని అన్ని వర్సిటీల విద్యార్థులు హాజరవుతారన్నారు. జాతీయ నూతన విద్యా విధానంతో పాటు వర్తమాన అంశాలపై చర్చిస్తారన్నారు. ఈ మేరకు ఇన్‌చార్జి వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు శుక్రవారం పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ విభాగం అధ్యక్షుడు గణేష్, కార్యదర్శి అభిషేక్, మహిళా కన్వీనర్ సునీత తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి మూడంచెల పోరాటం



నిరసన వ్యక్తం చేస్తున్న తపాలా ఉద్యోగులు

రాజమహేంద్రవరం సిటీ: తపాలా శాఖలో వివిధ క్యాడర్లలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి మూడంచెల పోరాటాలు నిర్వహించనున్నట్టు రాజమహేంద్రవరం డివిజన్ తపాల ఉద్యోగుల సంఘం కార్యదర్శి బి. కొండబాబు తెలిపారు. నేషనల్ ఫెడరేషన్ పోస్టల్ ఎంప్లాయూస్ అనుబంధ సంఘాలు, ఏఐజీడీఎస్‌యూ జాతీయ స్థాయిలో ఇచ్చిన పిలుపు మేరకు, రెండో దశ పోరాటాలలో భాగంగా శుక్రవారం హెడ్ పోస్టాఫీస్ వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి డిమాండ్లపై నినదిస్తూ నిరసన తెలియజేశారు. సమస్యల పరిష్కారానికి పోస్టుకార్డు, ఈ మెయిల్ కాంపైన్ నిర్వహిస్తున్నామని కొండబాబు తెలిపారు. మూడో దశ పోరాటంలో భాగంగా వచ్చే నెల 12, 13 తేదీలలో ఢిల్లీలోని డాక్ భవన్ ఎదుట నిరాహార దీక్ష చేయనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం తపాల డివిజన్‌లో ఉన్న రాజమహేంద్రవరం, రామచంద్రపురం శాఖలకు చెందిన పి-3, పి-4, జీడీఎస్ ఉద్యోగులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంపై పోరాడదాం

ప్రకాశంనగర్ (రాజమహేంద్రవరం) : మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వంపై పోరాటాలకు సిద్ధమవుదామని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోరుమామిళ్ల సుబ్బరాయుడు పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ మహాసభ స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగింది. అంతకుముందు రెల్లిపేట నుంచి తాడితోట కార్యాలయం వరకు కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో సుబ్బారాయుడు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు నిరంతరం శ్రమ దోపిడీకి గురవుతూనే ఉన్నారని ఆరోపించారు. మున్సిపాల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కిర్ల కృష్ణారావు, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు తాటిపాక మధు మాట్లాడుతూ గతంలో మంత్రి నారాయణకు ఇచ్చిన అర్జీలకు ఇప్పటికీ పరిష్కారం కాలేదన్నారు. రాజకీయ జోక్యాలు అధికమై మార్కాపురం తదితర చోట్ల కార్మికులను తొలగిస్తున్నారని, ఇది సరైన పద్ధతి కాదని ఆయన హెచ్చరించారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ కె.రాంబాబు, యూనియన్ నాయకులు డి.దుర్గమ్మ, అల్లం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సొమ్ము కోసం కుమ్ములాట

- కూటమిలో రచ్చకెక్కుతున్న విభేదాలు
- టీడీపీ, జనసేన నేతల మధ్య పంపకాల పంచాయితీ
- మద్యం, ఇసుకలో వాటా ఇవ్వడం లేదని జనసేన నేతల ఆవేదన
- కొవ్వూరులో ఇసుక రీచ్ విషయంలో ఎమ్మెల్యే, జనసేన ఇన్‌చార్జికి మధ్య గొడవ
- సీతానగరంలో మద్యం షాపుల విషయంలో నేతల ముష్టియుద్ధం
- జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి
- పార్టీ అధినేతలు సూచిస్తున్నా పట్టించుకోని నేతలు



సాక్షి, రాజమహేంద్రవరం: ధనార్జనే ధ్యేయంగా టీడీపీ, జనసేన నేతలు వ్యవహరిస్తున్నారు. అక్రమాదాయం కోసం అర్రులు చాస్తున్నారు. మద్యం, ఇసుక, అధికారుల బదిలీలు ఇలా విషయం ఏదైనా కలెక్షనే ప్రధాన అజెండాగా ముందుకెళుతున్నారు. జనసేన ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో టీడీపీ నేతలకు మద్యం షాపుల్లో 20 శాతం వాటా, టీడీపీ ఎమ్మెల్యేలున్న నియోజకవర్గాల్లో జనసేన నేతలకు 20 శాతం వాటాలు ఇవ్వాలంటూ పట్టుబడుతున్నారు. ఇందుకు కొందరు టీడీపీ నేతలు ససేమిరా అంటుండటంతో విభేదాలు రచ్చకెక్కుతున్నాయి. మరికొన్ని ప్రాంతాల్లో ఇసుక దుమారం రేగుతోంది. ఇసుక మాఫియా అవతారం ఎత్తిన టీడీపీ శ్రేణులు జనసేన నేతలకు నామమాత్రంగా రీచ్‌ల్లో భాగస్వామ్యం కల్పిస్తుండటంతో జనసైనికులు మండిపడుతున్నారు. కొన్ని నియోజకవర్గాల్లో అయితే జనసేన నేతలు ఉన్నారన్న విషయం సైతం గుర్తించడం లేదన్న వాదన బలంగా వినిపిస్తోంది. తమ నేత అండతో ప్రభుత్వం ఏర్పరచుకున్న టీడీపీ నేతలు తమనే పక్కనబెట్టేస్తున్నారని విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ వ్యవహారం జిల్లాలో హాట్‌టాపిక్‌గా మారింది. సార్వత్రిక ఎన్నికల సమయంలో సీట్ల పంపకాల్లో టీడీపీ, జనసేన నేతల మధ్య నెలకొన్న వర్గ విభేదాలు నేటికీ సమసిపోవడం లేదు. అప్పటి నుంచీ అదే పంథా కొనసాగుతుండటంతో కూటమి మైత్రికి చేటు తెచ్చే పరిస్థితులు దాపురించాయని రెండు పార్టీల అభిమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొవ్వూరులో ఇసుక పంచాయితీ

కొవ్వూరు టీడీపీ పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన ఇసుక పంచాయితీ సందర్భంగా టీడీపీ, జనసేన నేతల కుమ్ములాట సంచలనం రేకెత్తించింది. ఇసుక ర్యాంపుల వ్యవహారంపై జరిగిన చర్చ ఇరుపార్టీ నేతల మధ్య వాగ్వాదానికి దారి తీసింది. దీంతో ఒక్కసారిగా నియోజకవర్గ పార్టీ శ్రేణులు అవాక్కయ్యాయి. జనసేన నియోజకవర్గం ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావుకు, కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మధ్య ఇసుక ర్యాంపుల నిర్వహణ అంశం ఘర్షణకు దారి తీసింది. జనసేన నేత టీవీ రామారావు ఇంటి సమీపంలోని ఎరినమ్మఘాట్‌లో జనసేన నేతలకు 25 మీటర్లు కేటాయించారు. తనకు వ్యక్తిగతంగా కేటాయించాలంటూ టూమెన్ కమిటీ ముందు జనసేన నేత టీవీ రామారావు ప్రతిపాదన తీసుకొచ్చారు. ఆయన ప్రతిపాదనపై టీడీపీ ద్విసభ్య కమిటీ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో నేతల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకున్నట్టు సమాచారం. ఇది కాస్తా గొడవకు దారి తీసింది. ఆగ్రహానికి గురైన జనసేన నేతలు టీడీపీ నాయకులతో ముష్టియుద్ధానికి దిగినట్టు తెలిసింది. చివరకు కలగజేసుకున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అక్కడి నుంచి వెళ్లిపోవడంతో వివాదం సద్దుమణిగినట్టు సమాచారం.

సీతానగరంలో మద్యం మంటలు

మద్యం షాపుల కేటాయింపు సీతానగరం మండలంలో టీడీపీ, జనసేన నేతల మధ్య మంటలు రేపింది. మండలంలో రెండు మద్యం షాపులు టీడీపీ శ్రేణులకు కేటాయించారు. ఒక షాపు స్థానిక టీడీపీ నేత, మరో షాపు మండపేటకు చెందిన టీడీపీ నేత నడుపుతున్నారు. రాజానగరం నియోజకవర్గానికి జనసేన ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహిస్తుండటంతో తమకు షాపుల్లో 25 శాతం వాటా ఇవ్వాలని ఆయన నిబంధన పెట్టినట్లు సమాచారం. ఈ విషయమై షాపుల యజమానులు స్పందించలేదు. దీంతో జనసేన నేతలు గురువారం షాపుల వద్దకు వెళ్లి తమకు వాటా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ దుకాణాలు మూయించేశారు. చివరకు రంగంలోకి దిగిన దుకాణం యజమాని సర్దిచెప్పేందుకు ప్రయత్నించారు. ఎంత చెప్పినా ససేమిరా అనడంతో.. తాను ఎమ్మెల్యేతో మాట్లాడుతానని చెప్పడంతో జనసేన నేతలు వెనుదిరిగి వెళ్లినట్టు తెలిసింది.


రాజమహేంద్రవరం సిటీలో బెదిరింపుల పర్వం

రాజమహేంద్రవరం నగరంలో మద్యం షాపుల విషయంలో బెదిరింపుల పర్వం కొనసాగుతోంది. సిండికేట్‌లో కలవని ఎవ్వరినీ వ్యాపారం చేసుకోనివ్వడం లేదు. చివరకు టీడీపీ నేతలైనా తాము చెప్పింది వినాల్సిందే అంటూ ఎమ్మెల్యే అనుచరులు హుకుం జారీ చేస్తున్నారు. గోపాలపురం నియోజకవర్గానికి చెందిన ఓ టీడీపీ నేతకు రాజమహేంద్రవరం సిటీలో ఓ మద్యం షాపు లాటరీలో దక్కింది. ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అనుచరులు ఆ షాపు తమకే ఇవ్వాలని, లేదంటే వ్యాపారం చేయలేవంటూ హెచ్చరించినట్టు సమాచారం. చివరకు రూ.20 లక్షలు ఇచ్చేసి ఆ నేత నుంచి షాపును లాక్కున్నట్టు తెలిసింది. బెదిరింపుల వ్యవహారాన్ని సదరు టీడీపీ నేత లోకేష్, సీఎం దృష్టికి తీసుకెళ్లినట్టు సమాచారం.



ఆధ్యాత్మిక యాత్రకు నేటి నుంచి శ్రీకారం

- 6 పుణ్య క్షేత్రాల సందర్శన
- భక్తుల రద్దీ, డిమాండ్ పెరిగితే ఆదివారం కూడా ఏర్పాటుకు యోచన



కోరుకొండలోని లక్ష్మీనృసింహుని ఆలయం

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరం రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఒక రోజు ఆధ్యాత్మిక పర్యటన ప్యాకేజీని శనివారం నుంచి ప్రారంభించనున్నారు. జిల్లాలో వారాంతంలో ప్రముఖ దేవాలయాలు, పంచారామ క్షేత్రాలు సందర్శించేలా ఒక రోజు టూర్ ప్యాకేజీ ఏర్పాటు చేశారు. ఈ ప్యాకేజీలో కోరుకొండ, అన్నవరం, పిఠాపురం, సామర్లకోట, ద్రాక్షారామం, వాడపల్లి ఆలయాల సందర్శనకు అవకాశం కల్పిస్తున్నారు. పర్యాటకుల రద్దీ, డిమాండ్ దృష్ట్యా ఆదివారం కూడా బస్సులు ఏర్పాటు చేసేలా అధికారులు యోచిస్తున్నారు. 18 సీటింగ్‌తో సౌకర్యవంతంగా సాగే ఈ యాత్ర రాజమహేంద్రవరం సరస్వతీ ఘాట్ వద్ద టూరిజం కార్యాలయం నుంచి ఉదయం ఆరు గంటలకు ప్రారంభమై రాత్రి 7.30కు ముగుస్తుంది. పెద్దలకు రూ.వెయ్యి చొప్పున, 3 నుంచి పదేళ్ల లోపు చిన్నారులకు రూ.800గా ధర నిర్ణయించారు. ఈ యాత్ర తొలుత కోరుకొండకు చేరుకుని అక్కడ లక్ష్మీనృసింహుని దర్శనానంతరం, అన్నవరం, పిఠాపురంలోని పాదగయ, సామర్లకోటలోని పంచారామ క్షేత్రం భీమేశ్వర ఆలయం, ద్రాక్షారామాల్లోని దర్శనాల అనంతరం కోనసీమ జిల్లా వాడపల్లి వేంకటేశ్వర స్వామి దర్శనం అనంతరం తిరుగు ప్రయాణం కానున్నారు.

గోదావరి హారతి దర్శనం

పర్యటన అనంతరం రాజమహేంద్రవరానికి చేరిన యాత్రికులకు రాత్రి 7 గంటలకు హేవలాక్ బ్రిడ్జి వద్ద నిర్వహించే గోదావరి హారతి దర్శనం కల్పించి పర్యాటక శాఖ కార్యాలయానికి తీసుకు వస్తారు.

800 కిచెన్ గార్డెన్లు లక్ష్యం

- డీఎస్ఈవో వాసుదేవరావు
- పదివేల సీడ్ బాల్స్ పంపిణీ



ప్రధానోపాధ్యాయులకు సీడ్ బాల్స్ అందజేస్తున్న వాసుదేవరావు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో దాదాపు 800 పైగా న్యూట్రి గార్డెన్లు ఏర్పాటు చేయడానికి లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్టు జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు తెలిపారు. స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రాజమహేంద్రవరం డివిజన్ హెచ్‌ఎంలు, ఎంఈఓతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ఖాళీగా ఉన్న స్థలాల్లో కిచెన్ గార్డెన్లు పెంచాలని ప్రభుత్వం నిర్దేశించిందని, అలాగే పది వేల మొక్కలు నాటడం లక్ష్యంగా పెట్టుకున్నట్టు వాసుదేవరావు తెలిపారు. వాసవి క్లబ్ జిల్లా గవర్నర్ వలివేటి ప్రసాద్ ఈ న్యూట్రి గార్డెన్ కార్యక్రమానికి పది వేల సీడ్ బాల్స్‌ను అందజేశారన్నారు. వాటిని శుక్రవారం రాజమహేంద్రవరం డివిజన్ ప్రధానోపాధ్యాయులకు అందజేసినట్టు తెలిపారు. విద్యార్థులకు పోషకాహారాన్ని అందజేయడం లక్ష్యంగా వీటిని పెంచుతున్నట్టు ఆయన తెలిపారు. రాజమహేంద్రవరం డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి ఈవీబీఎస్ నారాయణ మాట్లాడుతూ అపార్ డేటాను అత్యంత శ్రద్ధగా పొరపాట్లు లేకుండా పూర్తి చేయాలన్నారు.

విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి సేకరించిన సమ్మతి పత్రాలను భద్రపరచాలన్నారు. యూ డైస్ డేటా లో విద్యార్థి పేరు పుట్టిన తేదీ ఆధార్ కార్డులో ఒకేలా ఉండేలా చూసుకోవాలన్నారు. డీసీఈబీ సెక్రటరీ డి.అనిత మాట్లాడుతూ నవంబర్ 18వ తేదీ నుంచి పదో తరగతి విద్యార్థులకు రివిజన్ టెస్టులు ప్రారంభమవుతాయన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయ ఏడీ వెంకటరాజు, ఎంఈవోలు స్వామి, రామన్న దొర, తులసీదాస్, సమగ్ర శిక్షా ఏంఓ గౌరీ శంకర్, రాజమహేంద్రవరం డివిజన్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

సనాతన ధర్మ ప్రచారానికి పాదయాత్ర

- భారతీయ ధర్మ పరిషత్ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీకృష్ణ చరణానంద



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీకృష్ణ చరణానంద స్వామి

సీటీఆర్ఐ: సనాతన ధర్మ ప్రచారానికి పాదయాత్ర చేపడతున్నట్టు భారతీయ ధర్మ పరిషత్ వ్యవస్థాపక అధ్యక్షుడు, శ్రీ యాజ్ఞవల్క్య రాజాశ్రమ పీఠాధిపతి శ్రీ కృష్ణ చరణానంద తెలిపారు. శుక్రవారం స్థానిక ఉమా కోటిలింగేశ్వరస్వామి కల్యాణ మండపంలో ధర్మ పరిషత్ సమావేశం నిర్వహించారు. ప్రధానంగా దేశంలోని అన్ని గ్రామాల్లో సనాతన ధర్మ ప్రచారంతో పాటు పాదయాత్ర చేస్తూ జ్ఞాన విజ్ఞాన చైతన్యం కలిగిస్తున్నామని పీఠాధిపతి తెలిపారు. భారతీయ సంస్కృతి, నాగరికతపై అవగాహన కలిస్తూ విద్యార్థులకు మనోవికాస తరగతులు ఏర్పాటు చేసి చైతన్యపరుస్తున్నట్టు ఆయన తెలిపారు. గో సంరక్షణ గురించి ఎక్కువగా ప్రయత్నం చేస్తున్నామని, దేవాలయాన్ని భ్రష్టు పట్టించే వ్యవస్థపై పోరాడుతున్నామని వివరించారు. బ్రహ్మచారిణి విరజా చైతన్య, పేరవరం గీతా ఆశ్రమ అధిపతి సత్యానందగిరి స్వామి, పొడుగు వెంకట సత్యనారాయణ ప్రసాదచార్యులు, కోరుకొండ శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ అర్చకుడు అనంత ఆచార్యులు పాల్గొన్నారు.

ఇసుక తవ్వకాలలో నిబంధనలు బేఖాతరు



ముగ్గళ్ల ర్యాంపులో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు

- ముగ్గళ్ల ర్యాంపు నుంచి యథేచ్ఛగా రవాణా
- సొసైటీలో తవ్వకాలను అడ్డుకున్న వ్యక్తిపై దాడి

సీతానగరం: నిబంధనలు అతిక్రమించి ఇసుక తవ్వకాలు జరుపుతూ ట్రాక్టర్లపై రవాణా యథేచ్ఛగా సాగిపోతోంది. ప్రభుత్వ ఉచిత ఇసుక విధానం ప్రవేశపెట్టిన నాటి నుంచి అనుమతులు లేని ఇసుక ర్యాంపుల నుంచి ట్రాక్టర్లపై ఇసుక తరలిపోతోంది. మండలంలో సింగవరం, వంగలపూడి, ముగ్గళ్ల ర్యాంపుల నుంచి ఇసుకను ఇష్టారాజ్యంగా తరలించుకుపోతున్నారు. ప్రభుత్వం అనుమతి ఇచ్చిన ర్యాంపు నుంచి మాత్రమే ఇసుక తవ్వకాలు జరపాలని ఆదేశాలు ఉన్నాయి. అలాగే అవసరమైన వారు స్థానిక సచివాలయంలో ట్రాక్టర్ నెంబరుతో రిజిస్ట్రేషన్ చేయించుకుని ఎన్ని ట్రక్కులు ఇసుక అవసరమో తెలిపి ఉచితంగా ఇసుక తీసుకువెళ్లవచ్చన్నది నిబంధన. ప్రభుత్వ వంగలపూడి, మునికూడలి ర్యాంపులలో మాత్రమే ఇసుక తవ్వకాలకు అనుమతులు ఇచ్చింది. అయితే గోదావరి నీరు ఎక్కువగా ఉండటంతో తవ్వకాలు ప్రారంభించలేదు.



రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సొసైటీ కార్యదర్శి వెంకటరమణ

కాగా ముగ్గళ్ల ర్యాంపు నుంచి నిత్యం అధిక సంఖ్యలో ట్రాక్టర్లతో ఇసుక రవాణా అవుతోంది. దళితులకు సంబంధించిన సొసైటీ లంక భూమిలో ఇసుక తవ్వకాలు జరుపుతున్నారని గుర్తించిన సొసైటీ లంక రైతులు తమ సొసైటీ సెక్రటరీ మట్టాడి వెంకటరమణను తీసుకుని వెళ్లారు. సొసైటీ లంకలో తవ్వకాలు జరపవద్దని ట్రాక్టర్ల యజమానులకు చెప్పడంతో వారు దాడికి దిగారు. ఈ దాడిలో వెంకటరమణ గాయపడి రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

అందరికీ అందుబాటులో ఇసుక

కొవ్వూరు: వినియోగదారులకు సకాలంలో ఇసుక లభించేలా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. శుక్రవారం మంత్రి వాడపల్లి ఇసుక ర్యాంపును సందర్శించారు. మరో వారం రోజుల్లో ఓపెన్ రీచ్‌లను అందుబాటులోకి తీసుకు వస్తామన్నారు. వినియోగదారుడి అవసరాలకు అనుగుణంగా ట్రాక్టర్లు, ఎడ్ల బళ్లపై తీసుకువెళ్లవచ్చని సూచించారు. ఈ నెల 12వ తేదీ వరకు మాత్రమే బిల్లులు చెల్లించారని, సకాలంలో ఇప్పించాలని బోట్స్‌మెన్స్ సొసైటీల ప్రతినిధులు మంత్రిని కోరగా వారానికి ఒక సారి బిల్లులు చెల్లించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. ఇసుక ర్యాంపుల్లో కూటమి నేతల ప్రమేయంపై విలేకర్లు ప్రశ్నించగా అవసరమైతే అటువంటి నాయకులను వదులు కోవడానికి సిద్ధమన్నారు. శనివారం నుంచి ఆఫ్‌లైన్ పూర్తి స్థాయిలో పనిచేసేలా చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. అలాగే ధవళేశ్వరం కాటన్ అతిథిగృహంలో సైతం ఆయన జిల్లా ప్రజా ప్రతినిధులు, అధికారులతో సమీక్షించి డిమాండ్‌కు అనుగుణంగా ఇసుక సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో కలెక్టర్ పి.ప్రశాంతి, ఎమ్మెల్యేలు ముప్పిడి వెంకటేశ్వరరావు, బత్తుల బలరామకృష్ణ, జేసీ ఎస్.చిన్నరాముడు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో కిరాణా వ్యాపారి మృతి

రాజానగరం: జాతీయ రహదారిపై దివాన్ చెరువు వద్ద శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో రంగంపేట మండలం వెంకటాపురానికి చెందిన కిరాణా వ్యాపారి మృతి చెందాడు. బొమ్మూరు ఎస్సై కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటాపురం పంచాయతీ వార్డు మెంబరు, వ్యాపారి అయిన బోడెం నాగేశ్వరరావు (40) దసరాకు తన గ్రామంలో కిరాణా దుకాణం ప్రారంభించాడు. దానిలో సరుకులను కొనుగోలు చేయడానికి శుక్రవారం మోటారు సైకిల్‌పై రాజమహేంద్రవరం వెళ్లాడు. సరుకులతో పాటు ఉల్లిపాయల బస్తాలను తీసుకువస్తుండగా దివాన్ చెరువు వద్ద వెనుక నుంచి అతి వేగంగా వాహనం ఢీకొని వెళ్లిపోయింది. మోటారు సైకిల్‌కు వెనుక కట్టిన ఉల్లిపాయల బస్తాలకు ఆ వాహనం తగులుకోవడంతో నాగేశ్వరరావు కింద పడిపోయాడు. అతని తలపై నుంచి వాహనం వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన వాహనం ఆగకుండా వెళ్లిపోయింది. విషయం తెలుసుకున్న వెంకటాపురం సర్పంచ్ గంగరాజు సంఘటనా స్థలానికి వచ్చి కన్నీటి పర్యంతమయ్యారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసును బొమ్మూరు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ యువకుడు..

ముమ్మిడివరం: గడ్డిమందు తాగి ఆత్మహత్యకు యత్నించిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ముమ్మిడివరం నగర పంచాయతీ రాజుపాలేనికి చెందిన తాడాల దుర్గాప్రసాద్ (25) తల్లిదండ్రులతో కలిసి ముమ్మిడివరం పోలీసు క్వార్టర్స్ వెనుక వీధిలో ఉంటున్నాడు. వృత్తిరీత్యా ఆప్పింగ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతడి సోదరి కూడా అనారోగ్యంతో పుట్టింటి దగ్గరే ఉండి వైద్య సేవలు పొందుతోంది. అయితే వైద్య చికిత్సకు డబ్బులు లేక తల్లిదండ్రులు ఇబ్బంది పడుతున్నారు. దుర్గాప్రసాద్ డబ్బులు ఇవ్వకపోవడంతో అతడిని మందలించారు. దీంతో ఈ నెల 23న గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. అపస్మారక స్థితికి చేరిన అతడిని ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందాడు. ఎస్సై డి.జ్వాలా సాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

240 కేజీల కల్తీ నెయ్యి స్వాధీనం



పిఠాపురంలో పట్టుబడిన కల్తీ నెయ్యి

పిఠాపురం: పిఠాపురంలోని ఇక ఇంట్లో కల్తీ నెయ్యిని తయారు చేస్తున్న ముఠాను అధికారులు పట్టుకున్నారు. అక్కడ 240 కేజీల కల్తీ నెయ్యిని, దాని తయారీకి ఉపయోగిస్తున్న సామాగ్రిని సీజ్ చేశారు. మున్సిపల్ కమిషనర్ కనకారావు తెలిపిన వివరాల ప్రకారం.. విశ్వసనీయ సమాచారం మేరకు పిఠాపురం రోడ్డు నంబరు 2 పద్మావతి నగర్‌లోని బండారు ఫణిప్రసాద్ ఇంటిపై మున్సిపల్ అధికారులు దాడి చేశారు. అక్కడ ఆవు కొవ్వుతో తయారు చేస్తున్న నెయ్యిని గుర్తించారు. దాన్ని దేవాలయాలకు సరఫరా చేస్తున్నట్లు తయారీదారులు తెలిపారు. కాగా.. వీరిపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు మున్సిపల్ కమిషనర్ తెలిపారు.

బ్రహ్మోత్సవం.. నేత్రపర్వం

- ఘనంగా వాడపల్లి వెంకన్న ఉత్సవాలు
- గోవింద నామస్మరణతో మార్మోగిన కోనసీమ తిరుపతి
- మలయప్ప అలంకరణతో గరుడ వాహనసేవ
- భక్తులతో కిటకిటలాడిన ఆలయం



వేంకటేశ్వస్వామికి అభిషేకం చేస్తున్న అర్చకులు



స్వామివారికి పట్టువస్త్రాలను సమర్పిస్తున్న ఆలయ ఈవో



ఆకట్టుకున్న కళాకారుల వేషధారణ

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతి కెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారికి మలయప్ప అలంకరణతో గరుడ వాహనసేవ నిర్వహించారు. మేళతాళాలతో అంగరంగ వైభవంగా గ్రామంలో భారీ ఊరేగింపు జరిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. సుప్రభాతసేవ అనంతరం ఉదయం తీర్థపుబిందెతో గౌతమీ గోదావరి జలాలను తీసుకు వచ్చి స్వామివారికి అభిషేకం చేశారు. గోత్ర నామాలతో పూజలు, నిత్యహోమాలు జరిగాయి. దేవదాయ ధర్మదాయశాఖ డిప్యూటీ కమిషనర్, ఆలయ ఈఓ నల్లం సూర్యచక్రధరరావు స్వామివారికి పట్టువస్త్రాలను అందజేశారు. ఖండవల్లి రాజేశ్వర వరప్రసాదాచార్యుల ఆధ్వర్యంలో వేద పండితులు, అర్చకులు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కాగా.. గరుడు వాహనంపై కొలువైన స్వామిని దర్శిస్తే బాధల నుంచి ఉపశమనం కలుగుతుందని భక్తుల నమ్మకం.

నేటి కార్యక్రమాలు

వేంకటేశ్వరస్వామికి శనివారం సంకల్పం, విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, విశేషార్చన, ప్రధాన హోమాలు, నీరాజన మంత్రపుష్పాలు, శ్రీకృష్ణ అలంకరణతో సూర్యప్రభ వాహన సేవ నిర్వహిస్తారు. సాయంత్రం స్వస్తి వచనం, ప్రధాన హోమాలు, నవగ్రహ హోమాలు, వేంకటేశ్వర హోమం, మోహిని అలంకరణతో చంద్రప్రభ వాహన సేవ జరపుతారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు చేసిన ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

నేరాల అదుపునకు ప్రత్యేక బృందాలు

- ఏలూరు రేంజ్ ఐజీ అశోక్ కుమార్
- తుని రూరల్ సర్కిల్ కార్యాలయంలో తనిఖీలు



తుని రూరల్ సర్కిల్ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేస్తున్న ఐజీ అశోక్ కుమార్

తుని రూరల్: ఏలూరు రేంజ్ పరిధిలో నేరాలు అదుపు చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్టు ఐజీ జీవీజీ అశోక్ కుమార్ తెలిపారు. కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్‌తో కలసి శుక్రవారం ఆయన తుని రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో వార్షిక తనిఖీలు నిర్వహించారు. అనంతరం ఐజీ విలేకర్లతో మాట్లాడుతూ రేంజ్ పరిధిలో జాతీయ రహదారిని ఆసరా చేసుకుని ఏజెన్సీ, ఒడిశా ప్రాంతాల నుంచి సాగుతున్న గంజాయి అక్రమ రవాణా, ఈవ్ టీజింగ్, ఇతర నేరాలను నివారించేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఇందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. జాతీయ రహదారిని అనుకుని ఉన్న దాబాలు, హోటళ్లలో చొరబడి దోపిడీ, హత్యలకు పాల్పడే ముఠాలను పట్టుకునేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఇందులో భాగంగా కాకినాడ జిల్లాలో ఎనిమిది వేల సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపినట్టు తెలిపారు. అలాగే ప్రైవేట్ వ్యాపార సంస్థలు కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ప్రోత్సహిస్తున్నట్టు చెప్పారు. నేరాల దర్యాప్తు, నేరస్తులను పట్టుకోవడానికి సీసీ కెమెరాలు ఎంతో దోహదపతాయన్నారు. సోషల్ మీడియాలో పరిచయమయ్యే వ్యక్తుల కారణంగా కలిగే అనర్థాలపై మహిళలకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఆయన వెంట పెద్దాపురం డీఎస్పీ డి.శ్రీహరిరాజు, సీఐలు జి.చెన్నకేశవరావు, గీతా రామకృష్ణ ఉన్నారు.

ప్రమాదవశాత్తూ కార్మికుడి మృతి

పిఠాపురం: షెడ్డు నిర్మాణం చేస్తుండగా ప్రమాదవశాత్తూ కిందపడి కార్మికుడు అక్కడిక్కడే మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. పిఠాపురం మండలం కందరాడలో బాలాజీ రైస్ మిల్లులో షెడ్డు నిర్మాణం చేపట్టారు. రాయవరం మండలం పసలపూడి గ్రామానికి చెందిన పుట్టి వెంకట రమణ (36) అక్కడ పనిచేస్తున్నాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం షెడ్డు నుంచి కాలుజారి కింద పడ్డాడు. అతడి తలకు రేకు బలంగా తగలడంతో తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పిఠాపురం రూరల్ ఎస్సై గుణశేఖర్ సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు వెంకట రమణకు భార్య, పాప, బాబు ఉన్నారు. మృతదేహాన్ని పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మద్యం దుకాణాలపై ప్రజాగ్రహం



ఏలేశ్వరంలో ఆందోళన చేస్తున్న స్థానికులు



గూడపల్లిలో మద్యం షాపు ముందు ధర్నా చేస్తున్న ప్రజలు



ఏఎస్సైకి వినతిపత్రం అందజేస్తున్న నీలాద్రిరావుపేట గ్రామస్తులు



అమలాపురంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రజా ప్రతినిధులు

ఏలేశ్వరం: కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన మద్యం పాలసీ ద్వారా దుకాణాల ఏర్పాటుకు లైసెన్సులు జారీ చేశారు. ఎక్కడైనా దుకాణాలు పెట్టుకోవచ్చనే నిబంధన ఉండడంతో జనావాసాల మధ్య ఏర్పాటు చేసేందుకు లైసెన్సుదారులు ప్రయత్నాలు చేస్తున్నారు. దీనిపై ప్రజల నుంచి తీవ్ర అగ్రహం వ్యక్తమవుతోంది. నివాస ప్రాంతాల్లో మద్యం దుకాణాలు వద్దంటూ మహిళలు ఆందోళనలు చేస్తున్నారు. ఏలేశ్వరంలోని మెయిన్ రోడ్డును ఆనుకుని మద్యం దుకాణం ఏర్పాటు చేసేందుకు వ్యాపారులు చర్యలు చేపట్టారు. దీన్ని నిరసిస్తూ శుక్రవారం స్థానిక నగరపాలక సంస్థ వద్ద స్థానికులు ఆందోళన చేశారు. నిత్యం మహిళలు రాకపోకలు సాగించే ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటుచేయడం దారుణమన్నారు. అక్కడకు వచ్చే మందుబాబులతో మహిళలు అవస్థలు పడే అవకాశం ఉందన్నారు. అనంతరం కమిషనర్ సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ ఆందోళనకు వైఎస్సార్ సీపీ నాయకులు సామంతుల సూర్యకుమార్, శిడగం వెంకటేశ్వరరావు, టీడీపీ నేత పైల సత్యనారాయణ సంఘీభావం తెలిపారు.

షాపు తొలగించాలి

మలికిపురం: గూడపల్లిలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణం వద్ద శుక్రవారం ఆ గ్రామస్తులు ఆందోళన చేశారు. గ్రామంలోని ఆర్అండ్‌బీ రోడ్డు పక్కనే శివాలయం, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం ఉన్నాయి. అక్కడికి సమీపంలోనే మద్యం దుకాణం ఏర్పాటు చేశారు. ఈ రోడ్డు మీదుగా పాఠశాల విద్యార్థులతో పాటు నాలుగు గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తారు. ఈ నేపథ్యంలో మద్యం దుకాణాన్ని వేరే చోటుకు మార్చాలంటూ గ్రామస్తులు ఆందోళన చేశారు. కొణిదెల శ్రీనివాసరావు, కుడిపూడి పండు, కొల్లి సుబ్బరాజు, పాటి సూర్యనారాయణ, కె.నానాజీ పాల్గొన్నారు

వేరేచోటుకు మార్చాలని వినతి

గండేపల్లి: నీలాద్రిరావుపేటలోని రామభద్ర చెరువు పక్కన గల ఖాళీస్థలంలో మద్యం దుకాణం ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి. దానిని వేరేచోటుకు మార్చాలంటూ గ్రామస్తులు శుక్రవారం అధికారులకు వినతి పత్రం అందజేశారు. అక్కడ మద్యం దుకాణం ఉంటే ప్రజలకు అనేక ఇబ్బందులు కలుగుతాయన్నారు. ఈ మేరకు నేదూరి సతీష్, రాంబాబు, మలిరెడ్డి అప్పారావు, తుపాకుల బాబీ, కాపు తదితరులు వినతిపత్రం అందజేశారు.

మద్యం షాపును మార్చాలి

పి.గన్నవరం: స్థానిక ఏటిగట్టు సెంటర్‌లో ఏర్పాటు చేసిన మద్యం షాపును మరో ప్రాంతానికి తరలించాలని ఆర్.ఏనుగుపల్లి, కె.ఏనుగుపల్లి, వై.కొత్తపల్లి గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు శుక్రవారం అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు దొమ్మేటి పార్వతి, తోలేటి బంగారు నాయుడు, తోరం వీర వెంకట సత్యనారాయణ, ఎంపీటీసీలు కొల్లే సూర్యనారాయణ, యాండ్ర విజయలక్ష్మి తదితరులు పి.గన్నవరంలో విలేకరులతో మాట్లాడుతూ పి.గన్నవరం నుంచి మూడు గ్రామాలకు వెళ్లే విద్యార్థినులు, మహిళలు ఏటిగట్టు సెంటర్‌లో ఆటోల కోసం వేచి చూస్తారన్నారు. ఆటో స్టాండ్ ఎదురుగా మద్యం షాపు ఉండడంతో విద్యార్థినులతో పాటు ప్రయాణికులు అసౌకర్యానికి గురవుతున్నారన్నారు. ఈ మేరకు అమలాపురం ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్‌కేడీవీ ప్రసాద్, కొత్తపేట ఎక్సైజ్ సీఐ, పి.గన్నవరం తహసీల్దార్ పి.శ్రీపల్లవి, ఎంపీడీఓ కేఎస్ ప్రసాద్‌లకు వినతి పత్రాలు అందజేశారు. స్థానిక ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణకు వినతిపత్రం అందజేసినట్టు తెలిపారు.

యువతి కిడ్నాప్‌కు యత్నించిన 9 మందిపై కేసు

కొత్తపేట: తల్లి, సోదరుడితో కలిసి వెళుతున్న యువతిని దారిలో అడ్డగించి కిడ్నాప్ చేసేందుకు ప్రయత్నించిన తొమ్మిది మందిపై కేసు నమోదు చేసినట్లు కొత్తపేట ఎస్సై జి.సురేంద్ర తెలిపారు. ఆయన శుక్రవారం రాత్రి విలేకరులకు తెలిపిన వివరాల ప్రకారం.. కపిలేశ్వరపురం మండలం కోరుమిల్లి గ్రామానికి చెందిన దంగేటి వెంకటరత్నం అనే మహిళ ఈ నెల 20వ తేదీన తన కుమారుడి ద్విచక్ర వాహనంపై తన 22 ఏళ్ల కుమార్తెతో కలిసి అంబాజీపేట మండలం ముక్కామల గ్రామానికి వెళ్లింది. అక్కడి నుంచి తిరిగి వస్తుండగా కొత్తపేట బోడిపాలెం వంతెన సమీపంలోని సాయిబాబా గుడి వద్ద వారిని కోరుమిల్లి గ్రామానికి చెందిన పోలిశెట్టి కృష్ణ, అతడి స్నేహితులు అడ్డగించారు. వెంకటరత్నం కుమార్తెను ప్రేమ కారణం చూపి కిడ్నాప్ చేసేందుకు ప్రయత్నించారు. దీనిపై వెంకటరత్నం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఫోరెన్సిక్ ల్యాబ్‌కు మృతదేహం భాగాలు

అన్నవరం: తొండంగి మండలం ఏవీ నగరం గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ బత్తిన మధుబాబుది సహజ మరణం కాదని వస్తున్న ఆరోపణల నేపథ్యంలో ఏవీ నగరం శ్మశానవాటికలో పూడ్చిన అతడి మృతదేహాన్ని శుక్రవారం తవ్వి బయటకు తీశారు. తుని ప్రభుత్వాసుపత్రి వైద్యులు ఆ మృతదేహంలో ముఖ్యమైన భాగాలను తీసి వైద్య పరీక్షల కోసం విజయవాడలోని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు. తహసీల్దార్ మురార్జీ, ఎస్సై జగన్‌మోహనరావు సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. మధుబాబును అతడి భార్య శిరీష, ఆమె ప్రియుడు పీతల ప్రశాంత్ హత్య చేశారని మధుబాబు బంధువులు ఆరోపణల నేపథ్యంలో ఈ చర్యలు తీసుకున్నారు.

లైంగిక దాడి కేసులో నిందితుడి అరెస్టు

పి.గన్నవరం: ఎల్.గన్నవరం గ్రామంలో పక్షవాతంతో మంచాన పడిన వృద్ధురాలిపై ఈ నెల 23న జరిగిన లైంగిక దాడి కేసులో నిందితుడైన అదే ప్రాంతానికి చెందిన లంకే సత్యనారాయణను శుక్రవారం సీఐ ఆర్.భీమరాజు అరెస్టు చేశారు. ఈ విషయాన్ని ఎస్సై బి.శివకృష్ణ విలేకరులకు తెలిపారు. నిందితుడిని రాజోలు కోర్టులో హాజరు పర్చగా 14 రోజుల పాటు రిమాండ్ విధించారన్నారు.

29, 30 తేదీల్లో క్రీడాకారుల ఎంపిక

ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం): రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ ఆదేశాల ప్రకారం రాష్ట్ర స్థాయి సివిల్ సర్వీసెస్ క్రీడలకు సంబంధించి పురుషులు, మహిళల విభాగంలో జిల్లా స్థాయి క్రీడాకారుల ఎంపికలు నిర్వహించనున్నారు. ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఈ నెల 29, 30 వ తేదీల్లో ఈ కార్యక్రమం జరుగుతుందని జిల్లా చీఫ్ కోచ్ డీఎంఎం శేషగిరి శుక్రవారం తెలిపారు. అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాస్కెట్ బాల్, క్యారమ్స్, చెస్, క్రికెట్, ఫుట్‌బాల్, హాకీ, కబడ్డీ, లాన్ టెన్నిస్, స్విమ్మింగ్, ఖోఖో, టేబుల్ టెన్నిస్, వెయిట్ లిఫ్టింగ్ /పవర్ లిఫ్టింగ్, వాలీబాల్, యోగా, రెజ్లింగ్, బెస్ట్ ఫిజిక్ అంశాల్లో ఎంపికలు జరుగుతాయన్నారు. ప్రభుత్వ ఉద్యోగులైన పురుషులు, మహిళలు అర్హులన్నారు. ఆసక్తి కలవారు ఈ నెల 28వ తేదీ సాయంత్రం 4 గంటల లోపు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు యోగా కోచ్ నాగేంద్రన్ 90329 34038, బాస్కెట్ బాల్ కోచ్ మోహన్‌దాస్ 96405 03679ను సంప్రదించాలని కోరారు.

టోర్నమెంట్ విజేతగా రామచంద్రపురం



ట్రోఫీని అందుకుంటున్న రామచంద్రపురం జట్టు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో రెండు రోజులుగా జరుగుతున్న ఇంటర్ కాలేజీయట్ బాస్కెట్ బాల్ మెన్ టోర్నమెంట్ కమ్ యూనివర్సిటీ టీమ్ ఎంపిక శుక్రవారంతో ముగిసింది. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలలోని అనుబంధ కళాశాలల నుంచి 13 జట్లు, 12 మంది వ్యక్తిగత క్రీడాకారులు ఈ పోటీలకు హాజరయ్యారు. విజేతలుగా నిలిచిన జట్ల వివరాలను రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ ప్రకటించారు. మొదటి స్థానంలో రామచంద్రపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రెండో స్థానంలో జి.మామిడాడలోని డీఆర్‌కే రెడ్డి కాలేజీ, మూడో స్థానంలో పెనుగొండ ఎస్‌వీకేపీ కళాశాల, నాలుగో స్థానంలో ఏలూరు సీఆర్ఆర్ కాలేజీ నిలిచాయి. ఈ జట్లలోని క్రీడాకారులకు ట్రోఫీలు అందజేసి అభినందించారు. వీరిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 12 మందితో పాటు అదనంగా మరో నలుగురిని యూనివర్సిటీ టీమ్‌గా ఎంపిక చేశారు. వీరు వచ్చే నెల ఒకటి నుంచి ఐదు వరకు బెంగళూరులో నిర్వహించే సౌత్ జోన్ పోటీలలో పాల్గొంటారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ఎంవీఎస్ఎస్ మూర్తి, సెలక్షన్ కమిటీ సభ్యులు రైల్వే కోచ్ ప్రసాద్, బాపిరెడ్డి, పరిశీలకులు పీడీ రమణ (పీఆర్ కాలేజ్), కోర్సు కోఆర్డినేటర్ డాక్టర్ కె.బాల సత్యనారాయణ, డాక్టర్ బి.రామ్‌గోపాల్, డేవిడ్ పాల్గొన్నారు.

రత్నగిరిపై ఇద్దరు పురోహితుల సస్పెన్షన్

అన్నవరం: వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో వ్రతాలాచరించే భక్తులను కానుకలు డిమాండ్ చేశారన్న ఆరోపణపై వ్రత విభాగంలో పనిచేస్తున్న ఇద్దరు వ్రత పురోహితులను సస్పెండ్ చేశారు. ఈ మేరకు దేవస్థానం ఈఓ కె.రామచంద్రమోహన్ శుక్రవారం రాత్రి ఆదేశాలు జారీ చేశారు. వ్రతాల సమయంలో గోదానం, భూదానం పేరుతో కానుకలు ఇవ్వాలని వ్రత పురోహితులు పెండ్యాల వీఆర్‌బీకే శర్మ (రాము), రాయప్రోలు శ్రీరామచంద్రమూర్తి డిమాండ్ చేశారని ఈ నెల 15, 22 తేదీలలో ఈఓకు భక్తులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వారిని సస్పెండ్ చేస్తూ ఆదేశాలిచ్చారు. ఈ వ్యవహారంపై వివరణ ఇవ్వాలని నలుగురు సూపర్‌వైజర్లకు షోకాజ్ నోటీసులు కూడా జారీ చేశారు.

కొబ్బరి మొక్కల నరికివేత

రౌతులపూడి: పి.చామవరం - పారుపాక సమీపంలోని గుండబోలు కోటేశ్వరరావుకు చెందిన భూమిలోని కొబ్బరి మొక్కలను స్థానిక టీడీపీ నాయకులైన సర్పంచ్ నందమూరి రాజా, అతడి అనుచరులు గుండబోలు అప్పన్నదొర, అరిగెల రవీంద్ర తదితర 25 మంది శుక్రవారం నరికివేశారు. దీనిపై కోటేశ్వరరావు రౌతులపూడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ సమయంలో అడ్డువచ్చిన వారిని చంపివేస్తామంటూ బెదిరించారన్నారు. ఈ ఘటనపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఎస్సై ఐ.వెంకటేశ్వరరావు తెలిపారు.

చెల్లని చెక్కు కేసులో మహిళకు జైలు

కాకినాడ లీగల్: చెల్లని చెక్కు ఇచ్చిన మహిళకి ఏడాది జైలు, రూ.4.50 లక్షల జరిమానా విధిస్తూ కాకినాడ మూడో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ డి.శ్రీదేవి శుక్రవారం తీర్పు చెప్పారు. కాకినాడ చెందిన బత్తిన రాణి నుంచి వరిపల్లి రత్నమాల 2020లో రూ.4 లక్షలు అప్పు తీసుకున్నారు. బాకీ తీర్చేందుకు 2021లో రూ.4.50 లక్షల చెక్కు ఇచ్చారు. ఆ చెక్కును రాణి బ్యాంక్‌లో వేయగా బౌన్స్ అయ్యింది. దీంతో ఆమె కోర్టును ఆశ్రయించారు. రత్నమాలపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు.